జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com


గురువారం | 24-7-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 404 పేజీలు: 4 వెల : రూ.7

# హెచ్‌ఈ మంగమ్మ పనితీరుపై... ఆరా!

**వజ్రపుకొత్తూరు/సంతబొమ్మాళి జూలై 23 (వార్త):** వజ్రపుకొత్తూరు మండలంలోని గోవిందపురం పీహెచ్‌సీలో హెల్త్ ఎడ్యుకేటర్ (హెచ్‌ఈ) మంగమ్మపై 'జాతీయవార్త'లో ప్రచురితమైన 'మంగమ్మా.. మాకొద్దమ్మా' శీర్షికన వెలువడిన కథనానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.అనిత స్పందించారు. మంగమ్మ పనితీరుపై ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. విధుల్లో నిర్లక్ష్యం, బయోమెట్రిక్ జాబితా, తదితర అంశాలపై ప్రత్యేక విచారణ బృందం నియమించినట్లు తెలిసింది. స్థానిక నాయకులు కొంతమంది ఆమె పనితీరుపై జిల్లా కలెక్టర్‌కు, డీఎంహెచ్‌ఓకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఏదేమైనా హెల్త్ ఎడ్యుకేషన్ మంగమ్మ వైద్యాధికారులపై చిందులు వేసిన వీడియోలు సామాజిక మాధ్యమాలలో చక్కర్లు కొట్టాయి. గతంలో హెచ్‌ఈ మంగమ్మ మందస పీహెచ్‌సీలో విధులు నిర్వహించేటప్పుడు నిర్లక్ష్యం కారణంగా అప్పటి డీఎంహెచ్‌ఓ డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షికు సిబ్బంది ఫిర్యాదు చేశారు. అప్పుడు కూడా డీఎంహెచ్‌వో విచారణ బృందం నియమించినట్టు సమాచారం.

జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ఎఫెక్ట్

* మంగమ్మపై వచ్చిన కథనాలకు విచారణకు బృందం
* ఆమెపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్న నేతలు






## నేరపరిశోధనపై అవగాహన అవసరం

* డీఐజీ గోపీనాథ్ జట్టి
* ప్రొబేషనరీ సివిల్ ఎస్ఐలకు అభినందన

**శ్రీకాకుళం క్రైం, జూలై 23(వార్త):** విశాఖపట్నం రేంజ్ డిఐజీ కార్యాలయంలో శిక్షణ పూర్తి చేసుకున్న ప్రొబేషనరీ సివిల్ ఎస్ఐలను డీఐజీ గోపీనాథ్ జట్టి శుభాకాంక్షలు తెలిపారు. అనంతపూర్, గ్రే హౌండ్స్ విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు జిల్లా, కర్నూలు ప్రాంతాలలో వివిధ రకాల శిక్షణ పొందిన తర్వాత, ఐదు నెలల పాటు జిల్లాల ప్రాక్టికల్ ట్రైనింగ్ కోసం వెళ్లే ముందు డీఐజీని వారంతా కలిశారు. 49 మంది పీఎస్ఐలలో 33మంది పురుషులు, 16 మంది మహిళలు ఉన్నారు. వీరిలో అనకాపల్లికి పది మంది, అల్లూరి సీతారామరాజు జిల్లాకు పది మంది, విజయనగరం జిల్లాకు తొమ్మిది మంది, పార్వతీపురం మన్యం జిల్లాకు పది మంది, శ్రీకాకుళం జిల్లాకు పదిమందిని కేటాయించారు. ప్రొబేషనరీ సివిల్ ఎస్ఐలను ఉద్దేశించి డీఐజీ మాట్లాడుతూ పోలీస్ విభాగంలో విధి నిర్వహణలో నిబద్ధత, నిజాయితీ, సేవా తత్పరత అత్యంత ముఖ్యమన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ, నేర పరిశోధన, సాంకేతిక పరిజ్ఞానం సాధన, పోలీసులు ఎదుర్కొనే సవాళ్లను అధిగమించడానికి ఎప్పటికప్పుడు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్లలో విధులు, రికార్డులు, స్థానిక చట్టాలు, భౌగోళిక పరిస్థితులపై అవగాహన కలిగి ఉండాలని స్పష్టం చేశారు. సహచర ఉద్యోగులు, ప్రజలతో విశ్వాసపూర్వక సంబంధాలు ఏర్పరచినప్పుడు సమర్థవంతమైన పోలీసింగ్ సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పీలు అమిత్ బర్దర్, వకుల్ జిందాల్, మహేశ్వర్ రెడ్డి, మాధవ రెడ్డి, ప్రొబేషనరీ ఎస్సైలు పాల్గొన్నారు.


# రాకాసి అల.. మింగేసింది!





* కెరటాలకు పడవ బోల్తా పడి మత్స్యకారుడు మృతి
* కన్నీరుమున్నీరైన కుటుంబీకులు
* బందరువానిపేటలో విషాదం
* పది లక్షలు ఆర్థికసాయం ప్రకటించిన మంత్రి అచ్చెన్నాయుడు

**శ్రీకాకుళం క్రైం, జూలై 23(వార్త):** వేట ముగించుకుని ఒడ్డుకు వస్తున్న సమయంలో రాకాసి అల ఓ మత్స్యకారుడిని మింగేసింది. వివరాల్లోకి వెళితే.. గార మండలం బందరువానిపేటకు చెందిన బడి గజేంద్ర అనే మత్స్యకారుడు వేటకు వెళ్లి మృతి చెందాడు. గజేంద్రతో పాటు మరో నలుగురు మత్స్యకారులు బుధవారం వేకువజామున సముద్రంలో చేపల వేటకు బోటుపై వెళ్లారు. వేట ముగించుకుని తిరుగు ప్రయాణంలో ఒడ్డుకు చేరుకునే సమయంలో రాకాసి అలలు పెద్ద ఎత్తున ఎగిసి పడ్డాయి. దీంతో బోటు బోల్తా పడింది. బోటు వెనుకవున్న ఇంజను గజేంద్రకు తగిలి గాయపడి, సముద్రంలో గల్లంతయ్యాడు. వెంటనే తోటి మత్స్యకారులు అతని కోసం సంద్రంలో గాలించినా ఫలితం లేకపోయింది. కొద్దిసేపటికే తీరానికి గజేంద్ర మృతదేహం కొట్టుకువచ్చింది. గజేంద్ర మృతదేహం వద్ద కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సిహెచ్ గంగరాజు బందరువానిపేటకు చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడికి భార్య పోలమ్మ, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.



### రూ.10లక్షల సాయం

గార మండలం బందరువానిపేటకు చెందిన మత్స్యకారుడు బడి గజేంద్ర మృతి చెందడంతో ఆయన కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా నిలిచింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రత్యేక చొరవతో ప్రభుత్వం రూ.10లక్షల పరిహారం ప్రకటించింది. ఈ పరిహారంలో ప్రభుత్వం నుంచి రూ.5లక్షలు, మత్స్యశాఖ నుంచి రూ.5 లక్షలు మంజూరు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. సముద్రంలో వేటకు వెళ్లే మత్స్యకారులు తప్పనిసరిగా భద్రతా చర్యలు తీసుకోవాలని, ఈ విషయంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని మత్స్యశాఖ అధికారులను ఆయన ఆదేశించారు.

## స్మార్ట్ మీటర్లపై అపోహలు వీడండి

* బిల్లుకు అదనపు ఛార్జీలు ఉండవు
* టారీఫ్ ప్రకారమే బిల్లులు
* వినియోగం, బిల్లు నియంత్రణ మీ చేతుల్లోనే
* సందేహాల నివృత్తికి టోల్ ఫ్రీ నెంబర్
* ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కృష్ణమూర్తి

**శ్రీకాకుళం, జూలై 23(వార్త):** విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపుపై ఎటువంటి అపోహలు అవసరం లేదని, వీటి వల్ల వినియోగదారులపై ఎలాంటి అదనపు ఛార్జీల భారం ఉండదని ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎన్ కృష్ణమూర్తి బుధవారం తెలిపారు. ప్రస్తుత మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లతో మార్చాలనే ప్రతిపాదనకు 2021 ఫిబ్రవరిలో ఏపీఈఆర్సీ ఆమోదం తెలిపిందన్నారు. ఏపీఈఆర్సీ రెగ్యులేషన్ 2021 ప్రకారం ప్రభుత్వ, వాణిజ్య కేటగిరీల వినియోగదారులకు వీటిని బిగిస్తున్నామని చెప్పారు. వీటితోపాటు ఎక్కువ విద్యుత్ వినియోగం కలిగిన గృహ వినియోగదారులకు కూడా అమర్చుతున్నామని తెలిపారు. స్మార్ట్ మీటర్ ఏర్పాటు సమయంలో వినియోగదారులు వాటి ఖరీదుకానీ, ఛార్జీలు కానీ, మామూళ్లు కానీ చెల్లించవలసిన అవసరం లేదన్నారు. విద్యుత్ బిల్లుతో పాటు నెలవారీగా ఎటువంటి ఇన్స్టాల్‌మెంట్లు వసూలు చేయమని స్పష్టం చేశారు. పాత మీటర్లతో పోలిస్తే స్మార్ట్ మీటర్ల ద్వారా మరింత పారదర్శకత పెరుగుతుందని పేర్కొన్నారు. వినియోగదారులకు ప్రస్తుత విద్యుత్ వినియోగాన్ని పర్యవేక్షించడానికి, వినియోగాన్ని సరిపోల్చుకోవడానికి ఇవి సహకరిస్తాయన్నారు. అధిక వినియోగాన్ని నియంత్రించుకొంటూ విద్యుత్ బిల్లులను తగ్గించుకొనేందుకు సహకరిస్తాయన్నారు. బిల్లు వివరాలను నేరుగా వినియోగదారుని మొబైల్‌కు చేరవేస్తామని చెప్పారు. సందేహాల నివృత్తి కోసం వినియోగదారులు టోల్ ఫ్రీ నెంబర్ 1912 కు సంప్రదించవచ్చని ఎస్ఈ ఎన్ కృష్ణమూర్తి తెలిపారు.

## సామాజికవేత్త కొర్ల కన్నారావు ఔదార్యం

**మందస, జులై 23(వార్త):** మందస మండలంలోని బిన్నళమదనాపురం పంచాయతీ వెంకటవరదరాజపురం గ్రామానికి చెందిన గాయత్రి ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్, సోషల్ వర్కర్ కొర్ల కన్నారావు ఔదార్యం చూపారు. బాలిగాం గ్రామానికి చెందిన ఎం.రవి అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. ఆయన చికిత్స కోసం రూ.5వేలు సాయాన్ని నగదుగా అందించారు. కన్నారావు ఔదార్యం పట్ల స్థానికులు అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ సంపతిరావు రాజేంద్ర ప్రసాద్, పైల జవహర్, హరిపురం జెడ్పీహెచ్ఎస్ పీఎంసీ చైర్మన్ కొంచాడ సురేష్ కుమార్, వైఎస్ఎన్ మూర్తి, భైరిశెట్టి గున్నయ్య తదితరులు పాల్గొన్నారు.



# భూములను కార్గో ఎయిర్‌పోర్ట్‌కు ఇవ్వం

**-ఉద్యమాన్ని అణచివేయాలనే బలప్రయోగం**

**-ఉద్దానం రైతుల నిరసన**



**మందస, జులై 23(వార్త):** కార్గో ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి స్థిరాస్తి భూములను ఇవ్వమని రైతులు తేల్చి చెప్పారు. కార్గో ఎయిర్ పోర్ట్ వ్యతిరేక కమిటీ అధ్యక్షుడు కొమర వాసు అధ్యక్షతన వజ్రపుకొత్తూరు మండలంలోని గునుపల్లి గ్రామకమిటీ ఆధ్వర్యంలో బాధిత రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గునుపల్లి గ్రామస్తులు మాట్లాడుతూ పచ్చని ఉద్ధానంలో కార్గో ఎయిర్ పోర్ట్ నిర్మాణాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రజల చేత ఎన్నికోబడని ప్రభుత్వాలు ప్రజాస్వామ్య విధానాలను అనుసరించాలే తప్ప రాష్ట్రాలలో, జాతీయ స్థాయిలో రాజకీయ నాయకులు, రాజకేయ పార్టీలు అధికార వ్యామోహానికి లొంగి, ప్రైవేటు కంపెనీలతో కుమ్మక్కయ్యారన్నారు. ఎన్నికల కోసం వారి వద్ద నుండి విరాళాలు తీసికొని వారికి కావాల్సిన తీరులో, ప్రజల వనరులను ధారాదత్తం చేసి, కలుషిత రాజకీయాలకి దారి తీస్తున్నారన్నాని ఆరోపించారు. శ్రీకాకుళం జిల్లాలోని పచ్చని ఉద్ధానంలో తరతరాలుగా అక్కడి ప్రజలకు ముఖ్యంగా కొబ్బరి, జీడి, పనస, మునగ, మామిడి తదితర పంట పొలాల చిన్నకారు రైతులకు, సంప్రదాయ మత్స్యకారులకు ఎన్నో విధాలుగా ఉపాధిని కలిగిస్తున్నటువంటి ఉమ్మడి వనరులని పరిరక్షించే బాధ్యత ప్రభుత్వానికి ఎంతైన ఉందని గుర్తు చేస్తున్నామన్నారు. నేటి ప్రభుత్వం ఏకపక్షంగా ప్రజలు ఆమోదం లేకుండా పోలీసు బలగాలను మోహరించి, సర్వేలు పేరిట అధికారులను, అనధికారులను, ప్రైవేటు కంపెనీ సిబ్బంది మా స్థిరాస్తి భూమిల పైకి రావడం అంటే మనం ఇప్పుడు ప్రజాస్వామ్య దేశంలో ఉన్నామా.. లేమా అని ప్రశ్నించారు. ప్రజలు తరుపున ఉండాల్సిన ప్రభుత్వాలు కంపెనీలకి దళారీగా వ్యవహరించి, ప్రజలు ఉద్యమాన్ని అణచి వేసే ఉద్దేశంతో పోలీసులు సహాయంతో బలప్రయోగం చెయ్యడం చాలా బాధాకరమన్నారు. బాధిత రైతు కుటుంబ మిత్రులు దళారీల మాటలు విని మోసపోవద్దని మనవి చేస్తున్నామన్నారు. ఎవరు ఎన్ని మాయమాటలు చెప్పిన మా గ్రామ స్థిరాస్తి భూమిని ఇచ్చేది లేదని గంటాపథంగా చెప్పారు. అవసరం అనుకుంటే మరో సోంపేట థర్మల్ పవర్ ప్లాంట్ లాగా మన కార్గో ఎయిర్పోర్ట్ ఉద్యమాన్ని ఉదృతం చేసి హక్కులని మనం కాపాడుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాంపురం స్థానిక సర్పంచ్ పొట్టి ధర్మారావు, చీపురుపల్లి సర్పంచ్ జోగి అప్పారావు, జోగి కామరాజు, జోగి శ్రీను, గండుపల్లి ధనరాజు(గ్రామ పెద్ద అధ్యక్షతన), సూరాడ మాధవరావు, జోగి నగేష్, తిర్రి బాలకృష్ణ, మద్దు రామారావు, కోనేరు నానమ్మ, జోగి నారాయణ, మైలపల్లి మాకమ్మ, కోడ లింగరాజు, జోగి లక్ష్మణ్, జోగి అనిల్, తిర్రి కమలమ్మ, ఎంపీటీసీ తిర్రి రాజారావు, కొమర వాసు, పొట్టి ధర్మారావు, జోగి అప్పారావు, ఉపాధ్యక్షుడు రామస్వామి, గుంటు రామస్వామి, మోహనరావు, మురుపల్లి పోలమ్మ, సూర్యకాంతం, బర్రి లోలాక్షి తదితరులు పాల్గొన్నారు



## జేసీఐ ఆధ్వర్యంలో ఉచిత ఐవీఎఫ్ శిబిరం

**ఇచ్ఛాపురం, జులై 23(వార్త):** జేసీఐ, ఓం శుభం మెడికల్ సంయుక్తంగా ఉచిత ఐవీఎఫ్ మరియు గైనెకాలజీ సమస్యలపై వైద్య శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. డా. దీపిక పాడి పర్యవేక్షణలో ఈ శిబిరాన్ని స్థానిక మహిళలు సద్వినియోగం చేసుకున్నారు. మొత్తం 22 మంది మహిళలు పరీక్షలు చేయించు కున్నారు. ఈ కార్యక్రమం విజయవంతం చేయడంలో ప్రాజెక్ట్ చైర్మన్ సంతోష్ సాహు, జేసీఐ అధ్యక్షులు కాళ్ళ జైదేవ్, సెక్రటరీ డాక్టర్ మోహన్ వెంకటేష్, సంతోష్ సాహు, తంగుడు షణ్ముఖ్, ఢిల్లీష్ తదితరులు పాల్గొన్నారు.

## తేలుకుంచి, తులసిగాంల్లో పొలం పిలుస్తోంది



**ఇచ్ఛాపురం, జులై 23(వార్త):** తెలుకుంచి, తులసిగం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వరి నాటు పనులు వేగంగా కొనసాగుతుండగా, రైతులకు శాస్త్రీయ పద్ధతులపై అవగాహన కల్పించడమేగాక, తాత్కాలికంగా ప్రయోజనం కలిగే పంట నిర్వహణ సూత్రాలను వివరించారు. ముఖ్యంగా, ఆకు చివర్ల కత్తిరింపు సరియైన అంతరదూరంతో నాట్లు వేయడం కలుపు మందు పిచికారి వంటి సాంకేతిక పద్ధతులు ప్రదర్శించారు. ఇవి మొక్కల ఆరోగ్య వృద్ధికి, వ్యాధి నివారణకు, సమర్ధవంతమైన పోషకాలను గ్రహించడానికి ఉపయోగపడతాయని అధికారులు వివరించారు.ఈ సందర్భంగా తెలుకుంచి గ్రామానికి చెందిన రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. రైతులకు నాణ్యమైన ఇన్పుట్స్ ఎంపిక ద్వారా అధిక దిగుబడి సాధించగలరనీ వ్యవసాయ అధికారులు సూచించారు. కార్యక్రమంలో ఎడీఏ టి. భవానీ శంకరరావు, ఏఓ అజయ్ కుమార్ , వీఏఏ సాయి చరణ్ రైతులు లోహిత్, మరెయ్య, ప్రజాప్రతినిధి మెరుగు సూర్యనారాయణ రెడ్డి ,లోపింటి పద్మనాభం పాల్గొన్నారు.

# అంగన్‌వాడీల్లో నాణ్యతతో కూడిన సేవలందించాలి



**పలాస, జులై 23(వార్త):** అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే లబ్ధిదారులకు నాణ్యతతో కూడిన సేవలందించాలని శ్రీకాకుళం జిల్లా పిడి బి. శాంతిశ్రీ అన్నారు. బుధవారం పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో మొగులుపాడు ఒకటో అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకొని క్షేత్రస్థాయిలో అంగనవాడీ సేవలు లబ్ధిదారులకు చేరే విధంగా సిబ్బంది కృషి చేయాలన్నారు. అంగనవాడీ కేంద్రాల్లో లబ్ధిదారుల వివరాలు విధిగా నమోదు చేస్తూ పెరుగుదల పర్యవేక్షణ, వెయ్యి రోజుల తల్లీబిడ్డల పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి సారించి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సిబ్బంది భాగస్వాములు కావాలని సూచించారు. క్షేత్రస్థాయిలో అంగనవాడీ టీచర్లు పూర్వ ప్రాథమిక విద్య, ఆరోగ్యలక్ష్మి అంగనవాడీ కేంద్రాల్లో పెరటి తోటల పెంపకాలపై శ్రద్ధ చూపించాలని పేర్కొన్నారు. సూపర్‌వైజర్లు క్షేత్రస్థాయి పర్యటనలో అంగనవాడీ కేంద్రాల్లో ఆహారనిల్వలపై ఎప్పటికప్పుడు జిల్లా అధికారులకు తెలియజేస్తూ పౌష్టికాహారంలో ఇబ్బందులు రాకుండా చూసుకుంటూ నాణ్యమైన సేవలు అందించాలన్నారు. అంగనవాడీ కేంద్రాల్లో అందిస్తున్న సేవలకొరకు వినియోగిస్తున్న న్యూట్రిషన్ హెల్త్ ట్రాకింగ్ సిస్టం పోషణ ట్రాకర్ అప్లికేషన్లపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. పూర్వ ప్రాథమిక విద్యా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రీస్కూల్కేంద్రాన్ని ఈ రోజు సాయంత్రం తనకి చేయడం జరిగింది, లబ్ధిదారుల అందరకి ఎఫ్ ఆర్ ఎఫ్ అనేది పూర్తి చేస్తేనే ప్రతి నెల స్టాక్ వస్తుంది అని తెలియజేశారు. ప్రీస్కూల్ అనేది ఆధార శిల , రైమ్స్, కథల పుస్తకాలు,, నవచేతన, ఈ పుస్తకాల ప్రకారం పూర్వప్రాదమిక విద్యా కార్యక్రమాలు నిర్వహించాలని, అంగన్వాడీ కార్యకర్తకు సూచించడం జరిగింది. పిల్లల చేత కార్యక్రమాలు బాగా చేస్తున్నారు అని, అంగన్వాడి కార్యకర్త పని తీరు బాగుంది అని టీచరు ని మెచ్చుకున్నారు . ఈ కార్యక్రమం లో కాశీబుగ్గ ప్రాజెక్ట్ అధికారి కె. పార్వతి,సూపర్‌వైజర్లు పి. గంగమ్మ, యు. లత, మొగిలిపాడు అంగన్వాడి కార్యకర్త జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ ఎన్ పేట జనసేన అధ్యక్షునిగా రవీంద్ర

**ఎల్ఎన్ పేట/ హిరమండలం, జులై 23(వార్త):** ఎల్ఎన్ పేట మండల జనసేన పార్టీ అధ్యక్షుడిగా కొల్ల రవీంద్రకు నియమించడం జరిగిందని పాతపట్నం నియోజకవర్గ జనసేన నాయకురాలు కొరికాన భవాని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనసేన పార్టీలో కష్టపడి పనిచేసినందుకు తనపై ఉన్న నమ్మకంతో పార్టీ అధిష్టానం గుర్తించి బాధ్యతను పెంచి మండల అధ్యక్షునిగా నియమించడం జరిగిందని తెలిపారు ఈ కార్యక్రమంలో పలువురు జనసేన నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



# బూత్ స్థాయిలో బీజేపీని బలోపేతం చేయండి

**విజయనగరం, జులై 23(వార్త):** భారతీయ జనతా పార్టీ జిల్లా పదాధికారుల తొలి సమావేశం విజయ నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్య క్షుడు ఉప్పలపాటి రాజేష్ వర్మ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ స్థాయిలో కార్యకర్తలను ఏ విధంగా బలోపేతం చేసుకొని వారితో కలిసి ముందుకు వెళ్లాలో అనే అంశం పైన మరియు పదాధికారుల విధి విధానాల గురించి క్లుప్తంగా వివ రించారు.

కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ సంబర లక్ష్మీ నరసింహం, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ రెడ్డి పావని, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోటగిరి నారాయణ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శిలు పతివాడ రాజేష్, వేమకోటి గిరిబాబు, జిల్లా ఉపాధ్యక్షులు ఆరిశెట్టి సూర్యనారాయణ, దోమ కామేశ్వరి, పెద్దింటి శ్రీదేవి, చొక్కాకుల అప్పారావు, జిల్లా కార్యదర్శిలు కొండపల్లి శ్రీనివాస్, ముగడ సాయి అనిల్ ,చింతపల్లి అప్పా రావు, చనపతి జానకి, గుడివాడ నాగరాజు, తిప్పాన పావని, సోషల్ మీడియా కన్వీనర్ మజ్జి రామారావు, జిల్లా కోశాధికారి బండి సత్యనారాయణ, ఐటీ కన్వీనర్ చందక శ్రీనివాస్ పాల్గొన్నారు.



## డిగ్రీ ఫలితాలలో స్వర్ణభారతి విద్యార్థుల ప్రతిభ

**ఇచ్ఛాపురం, జులై 23(వార్త):** అంబెడ్కర్ యూనివర్సిటీ డిగ్రీ 4వ సెమిస్టర్ ఫలితాలలో స్వర్ణ భారతి కి చెందిన బి. కామ్ కంప్యూటర్ అప్లికేషన్స్ గ్రూప్ కి సంబంధించి అమీన్ సాహెబ్ పేట మధ్యతరగతి కుటుంబానికి చెందిన బనిశెట్టి ప్రియదర్శిని 9.3 గ్రేడ్ పాయింట్స్ సాధించి నియోజక వర్గస్థాయిలో ఉత్తమ స్థానం కైవసం చేసుకున్నారు. దుర్గాసి ఐశ్వర్యా కంప్యూటర్ సైన్స్ గ్రూప్ కి సంబంధించి 9.0 గ్రేడ్ పాయింట్స్ సాధించారు. వీరిని ఛైర్మెన్ చాట్ల తులసి దాస్ రెడ్డీ పుష్ప గుచ్చం తో అభినందనలు తెలుపుతూ మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కొనియాడారు ఈ కార్యక్రమం లో అడ్మినిస్ట్రేటర్ చాట్ల రాము, డిగ్రీ, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్స్ సందీప్, జయప్రకాశ్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందిచారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## మజ్జి అనుచరుడు రఘునాథ్ మృతి



**మందస, జులై 23(వార్త):** మందస మండలంలోని హంసరాళి గ్రామానికి చెందిన కాంగ్రెస్ వాది, మజ్జి తులసీదాసు, శారదమ్మ అనుచరునిగా పని చేసిన నెయ్యిల రఘునాథ్ మరణించారు. కాంగ్రెస్ పార్టీలో అంకితభావంతో రఘునాత్ పని చేశారు. మజ్జి తులసీదాసు శిష్యునిగా పని చేసిన ఆయన శారద హయాంలో నిబద్ధత కలిగిన నాయకునిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన రాజకీయ జీవితం యావత్తూ కాంగ్రెస్ పార్టీలోనే గడిపార్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పాడ రాజారావు, మజ్జి బాబురావు, కొర్ల వెంకటరావు, కొర్ల హేమారావుచౌదరి, కొర్ల నాగేశ్వరరావు తదితరులు రఘునాథ్ అంత్యక్రియల్లో పాల్గొని, మృతదేహంపై కాంగ్రెస్పార్టీ జెండా కప్పి, నివాళులు అర్పించారు. రఘునాత్ మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు.



## 10 కిలోల గంజాయి తో వ్యక్తి అరెస్టు

**ఇచ్ఛాపురం, జులై 23(వార్త):** స్థానిక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో 10.260 కిలోల గంజాయి తో ఒరిస్సా కి చెందిన దీపక్ కుమార్ నాయక్ అనే వ్యక్తి ని అరెస్ట్ చేసినట్లు సి ఐ పి.డి ప్రసాద్ చెప్పారు. ఈగల్ టీమ్ సహకారంతో గంజాయి సరఫరా చేస్తున్న అజిత్ అనే వ్యక్తి పై కూడా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దీపక్ ను కోర్టు లో హాజరు పరిచినట్లు చెప్పారు.

## దడియాలను సన్మానించిన వాకర్స్



**పలాస, జులై 23(వార్త):** పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి ముత్యాలమ్మ వాకర్స్ క్లబ్ మెంబర్ దడియాల నరసింహులును ఆ వాకర్స్ క్లబ్ సభ్యులు బుధవారం ఘనంగా సన్మానించారు. పలాస ఎమ్మెల్యే గౌతు గౌతు శిరీషా పలాస ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుని (డైరెక్టర్ )గా దడియాల నరసింహులును నియమించడంతో ఆయనకు వాకర్స్ క్లబ్ సభ్యులు అభినందనలు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్ రాజేంద్ర, సభ్యులు హనుమంతు మురళీమోహన్,రాజారావు,రామ్మోహనరావు, ఇతర సభ్యులు వున్నారు. ఈయనతో పాటు సవర రాంబాబు కూడా నియమించడంతో ఎస్టీ వర్గాల వారినుండి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దడియాల నర్సింహులు మాట్లాడుతూ చాలా కాలంనుండి పార్టీ కోసం పనిచేయడం వలన ఎమ్మెల్యే శిరీష ఈ పదవి లో నన్ను నియమించడం చాలా ఆనందంగా ఉంది. ఎమ్మెల్యే శిరీషకి నా హృదయ పూర్వక నమస్సుమాంజలి తెలియ జేస్తున్నాను. ఈ పదవితో నాకు మరింత బాధ్యత పెరిగింది. ఎమ్మెల్యే నాపై నమ్మకంతో ఇచ్చిన ఈ పదవికి వన్నె తెచ్చేలా హాస్పిటల్ అభివృద్ధికి కృషి చేస్తానని తెలియజేస్తూ వాకర్స్ సభ్యులు అందరకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

## ప్రత్యేక అవసరాల పిల్లలతో మమేకం

**శ్రీకాకుళం, జులై 23(వార్త):** విభిన్న ప్రతిభావంతులైన పిల్లల పరిస్థితులు, వారి అభ్యాసం, జీవన ప్రమాణాలను ప్రత్యక్షంగా తెలుసుకోవడానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. కలెక్టరేట్ పరిధిలోని బెహరా మనోవికాస కేంద్రం, శాంతా కల్యాణ అనురాగ నిలయంలను సందర్శించారు. వారికి అందుతున్న మౌలిక సదుపాయాలు, పారిశుధ్య పరిస్థితులు, పిల్లల దినచర్యలను పరిశీలించిన ఆయన, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. విభిన్న ప్రతిభావంతులైన పిల్లల మానసిక వికాసం కోసం మరింత శ్రద్ధ పెట్టాలని సూచించారు. పిల్లలతో ఆప్యాయంగా మాట్లాడి పండ్లను అందజేశారు. తదుపరి శాంతా కల్యాణ అనురాగ నిలయంలోని సదుపాయాలను పరిశీలించి సిబ్బంది చేపడుతున్న జాగ్రత్తలు, వారి మానసిక వికాసం కోసం తీసుకుంటున్న చర్యలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ జి.ఇందిరా ప్రసాద్ కూడా ఆయన వెంట ఉన్నారు.

## ఆర్థిక అక్షరాస్యత ప్రతి ఒక్కరి బాధ్యత

**శ్రీకాకుళం, జులై 23(వార్త):** ఆర్థిక అక్షరాస్యత పొందటం ప్రతి ఒక్కరి బాధ్యతని లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ పి. శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం శ్రీకూర్మంలో యూనియన్ బ్యాంక్ వారు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరికీ ఓటీపీలు చెప్పకూడదని, అలాగే ప్రతి ఒక్కరూ కేంద్ర ప్రభుత్వ భీమా పథకాలు నమోదు చేసుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం మరియు ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆదేశాలు మేరకు జులై 1 నుండి సెప్టెంబర్ 30 వరకు జిల్లా వ్యాప్తంగా 917 గ్రామాల్లో జరుగుతున్న అవగాహన కార్యక్రమాల్లో భాగంగా ఈ రోజు యూనియన్ బ్యాంకు శ్రీకూర్మం శాఖ వారి ఆద్వర్యం లో ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రములో మేనేజర్ చిన్నరామయ్య, తదితరులు పాల్గోన్నారు.



## కౌన్సిలర్లకు చెప్పకుండా పనులు మంజూరా?

**-తమ ప్రమేయంతోనే వార్డుల్లో పనులు జరగాలి**

**-మూకుమ్మడిగా కౌన్సిలర్లు వాకౌట్**



**పలాస, జులై 23(వార్త):** కౌన్సిలర్లుకు ఏ సమాచారం అడిగిన ఇవ్వకుండా అధికారులు జాప్యం చేస్తున్నారని, మునిసిపల్ కమీషనర్ ఏకపక్ష ధోరణితో నియంత పాలన చేస్తున్నారని పలువురు కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ వార్డుల్లో ప్రజలకు అవసరమైన పనులను కౌన్సిలర్లు కమిషనర్ కు చూచిస్తుంటే వాటిని పట్టించుకోకుండా అధికార పార్టీ మెప్పు కోసం వారికి ఇష్టం వచ్చిన పనులు అజెండాలో పొందుపరుస్తూ కనీసం కౌన్సిలర్లుకు సమాచారం కూడా ఇవ్వకుండా అవమాన పరుస్తున్నారని అలాంటప్పుడు ప్రజా ప్రతినిధులుగా మేమెందుకు అని మండపడ్డారు. అలాంటప్పుడు కౌన్సిల్ సమావేశం కు తామెందుకు రావాలని నినదిస్తూ మునిసిపల్ సమావేశం నుండి వైస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు అందరూ వాక్-ఔట్ చేశారు. అనంతరం అజెండా అంశాలు పైన వైస్సార్సీపీ కౌన్సిలర్లు డీసెంట్ తెలియజేస్తూ మునిసిపల్ చైర్మన్ మరియు కమిషనర్ కు సంతకాలు చేసిన డిసెంట్ పత్రాలను అందించారు. 15వ ఆర్థిక సంఘ నిధులు తో చేస్తున్న పనులు ఎవరికీ తెలియజేయునవ్వలేదని పలువురు కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న 15వ ఆర్థిక సంఘ పనులు తమకు తెలిసినంతవరకు ఆపాలను కోరుతూ వైసిపి కౌన్సిలర్లంతా వాకౌట్ చేశారు. చైర్మన్ బల్ల గిరిబాబు స్పందిస్తూ ఎజెండాలోఎజెండాలో పొందుపరిచిన 15 ఆర్థిక సంఘ పనులకు వాయిదా వేశారు. అనంతరం సమావేశం సజావుగా సాగింది. సమావేశ అఅనంతరం ఇకపై మున్సిపాలిటీలో ఏ పనులు జరిగిన తమకు తెలిసే జరగాలని కోరుతూ కమిషనర్ కు, చైర్మన్ కు వినతి పత్రాలు అందించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు, డి ఈ కనకరాజు, వైస్ చైర్మన్లు మీసాల సురేష్ బాబు, బోరా బుజ్జి, కౌన్సిలర్లు గుజ్జు జోగారావు, పిచ్చిక అజయ్, తంగుడుఆషారాణి,గురిటి సూర్యనారాయణ, జ్యోతి నాయక్ పాల్గొన్నారు.

## హామీలు అమలు చేయలేని అసమర్ధుడు చంద్రబాబు






**మందస, జులై 23(వార్త):** మందస మండలంలోని హెన్నాళి గ్రామంలో బాబు ష్యూరిటీ -మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ సర్పంచ్ అనుసూయచౌదరి, ఎమ్పీటీసీ సుశీలమల్లికో ఆధ్వర్యంలో జరిగింది. చంద్రబాబు మోసపూరిత హామీలుతో ప్రజలు ఏ విధంగా మోసపోయారో.. ప్రజలకు నాయకులు వివరించారు. మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు హయాంలో జరిగిన అభివృద్ధి వివరించారు. అధిక సంఖ్యలో మహిళలు, యువకులు పాల్గొని విజయవంతం చేశారని పార్టీ నాయకులు చెప్పారు. కార్యక్రమంలో వైకాపా మండల పార్టీ అధ్యక్షుడు దల్లి జానకిరెడ్డి, ఎమ్పీపీ డి.దానయ్య, పార్టీ నాయకులు చింతాడ గణపతి, వైకుంఠరావు, పితాంబరం, బత్తిన వెంకట్, కె.గోపాల్, సిందిరి జగన్, సురేష్ పాణిగ్రాహి, బృందా, సవర రాము, గౌరకల కేశవరావు, హరికృష్ణ, గొలుసు చంద్రశేఖర్, బెలమర జీవన్, తలగాన శేఖర్, గున్న నారాయణ, శనాపతి దివ్య, గున్న రమణ, బొంగి రమణ, జగదీష్, సార రవి, రుక్మాంగద, నూకల రవణ, సుభాష్ లెంక పాల్గొన్నారు.

**ఇచ్ఛాపురం, జులై 23(వార్త):** ధర్మపురం లో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఎంపిపి బోర పుష్ప ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.ఎమ్మెల్సీ నర్తు రామారావు తనయయుడు బిసి సంక్షేమ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్తు శివాజీ , జడ్పీటీసీ ఉప్పడా నారాయణమ్మ, పిట్ట ఆనంద్, దుక్క ధనలక్ష్మి పాల్గొన్నారు.

## ఘనంగా సొసైటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం

**కొత్తూరు, జులై 23(వార్త):** కొత్తూరు మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్ (పీఏసీఎస్) పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం బుధవారం నాడు స్థానిక బోర సూర్యనారాయణ కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రానికి నియోజకవర్గ శాసనసభ్యులు మామిడి గోవిందరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని నూతన పాలకవర్గం బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఎమ్మెల్యే వారందరిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. సొసైటీ చైర్మన్‌గా మాతల గాంధీ,సొసైటీ డైరెకర్లుగా ఆరుబోలు దశరథ, చోడవరపు రాము బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభిప్రాయాలను అనుసరించి, రైతుల శ్రేయస్సే ప్రధాన లక్ష్యంగా పని చేయాలి. వ్యవసాయ రంగాన్ని అభివృద్ధిపరచడంలో సహకార సంఘాల పాత్ర కీలకం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షుడు అగతముడి మాధవరావు, సీనియర్ నాయకుడు అగతముడి భైరగినాయుడు, వైస్ ఎంపీపీ లోతుగడ్డ తులసి వర ప్రసాద్ నాయుడు,తొంపల తిరుపతి, ముగితి కృష్ణ, పాలవలస గోవింద మరియు సంబంధిత శాఖల అధికారులు, రైతు సంఘాల నాయకులు, నీటి యూజర్ సంఘాల ప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## సహకార శాఖలో ఆర్‌టీఐపై అవగాహన

**శ్రీకాకుళం, జులై 23(వార్త):** ప్రజలకు పారదర్శకంగా సమాచారాన్ని అందించడంలో ఆర్‌టీఐ చట్టం-2005 కీలక భూమిక పోషిస్తుందని జిల్లా సహకార అధికారి బి. మురళీ కృష్ణ (ఇన్‌ఛార్జ్) అన్నారు. సహకార సంఘాల కమిషనర్, రిజిస్ట్రార్ గుంటూరు ఆదేశాల మేరకు బుధవారం జిల్లా సహకార అధికారి కార్యాలయంలో ఆర్‌టీఐపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రజలకు సమయానుకూలంగా, సక్రమమైన సమాచారం అందించడమే సహకార విభాగం లక్ష్యమని మురళీ కృష్ణ అన్నారు. ఈ సందర్భంగా అధికారులు ఆర్‌టీఐ చట్టంలోని నిబంధనలు, సమాచార హక్కు వినియోగ విధానం, పీఐఓల బాధ్యతలు, సమాచారాన్ని నిర్దిష్ట గడువులో అందించాల్సిన అవసరాన్ని వివరిస్తూ పాల్గొన్నవారికి అవగాహన కల్పించారు. సదస్సులో డివిజనల్ సహకార అధికారులు (శ్రీకాకుళం, టెక్కలి), జిల్లా సహకార ఆడిట్ అధికారి, జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ లిమిటెడ్, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ పీఐఓలు, ఏపీఐఓలు పాల్గొన్నారు.

## విద్యుత్ శాఖ ఏఈ యోగేశ్వరరావుకు బదిలీ



**మందస, జులై 23(వార్త):** విద్యుత్ శాఖ ఏపీఈపీడీసీఎల్ మందస సెక్షన్ అసిస్టెంట్ ఇంజినీర్ గా పని చేస్తున్న లిమ్మల యోగేశ్వరరావు(యోగి)కు బదిలీ అయ్యింది. మందస, హరిపురం విద్యుత్ సబ్ స్టేషన్లను ఆయన పర్యవేక్షించేవారు. సుమారు ఆరేళ్లపాటు మందసలో ఆయన పని చేశారు. పాలకొండ విద్యుత్ శాఖ ఏఈగా ఆయన బదిలీపై వెళ్లనున్నారు. యోగేశ్వరరావు మొదటి పోస్టింగ్ మందసలోనే కాగా, ఆయన పని చేసిన కాలంలో వివాదరహితునిగా గుర్తింపు తెచ్చుకున్నారు. అంతేకాకుండా విధి నిర్వహణే కర్తవ్యంగా ఎవరి ఒత్తిళ్లకు గురి కాకుండా విధులు నిర్వహించారు. పాలకొండ వెళ్లనున్న యోగేశ్వరరావుకు స్థానిక సిబ్బంది అభినందనలు తెలిపారు.

# బ్యాంకులకు నిర్దేశించిన లక్ష్యాలు సాధించాలి

**-జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**



**శ్రీకాకుళం, జులై 23(వార్త):** ప్రభుత్వం నుంచి ఆయా బ్యాంకులకు నిర్దేశించిన లక్ష్యాలు సాధించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బ్యాంకర్లను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్యాంకర్లతో జిల్లా సంప్రదింపుల కమిటీ, జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో జిల్లా వార్షిక క్రెడిట్ ప్లాన్ 2024-25, ఎంఎస్ఎంఈ, విద్యా రుణాలు, వ్యవసాయానికి క్రెడిట్, చెల్లింపులు, స్వయం సహాయక సంఘాల గ్రూపులకు లింకేజి అండ్ ఎంసిపి డిజిటల్, పిఎం సూర్యఘర్, పిఎం విశ్వకర్మ, నాబార్డు, తదితర వాటిపై ఆయన బ్యాంకర్లతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ, మత్స్య శాఖ, ఉద్యానవన శాఖ, తదితర శాఖల లక్ష్యాలు గూర్చి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు ఎన్ని యూనిట్లు ఏర్పాటు చేశారని వివరాలు తెలుసుకొని బ్యాంకుల వారీగా ఆయా బ్యాంకులకు నిర్ణయించిన లక్ష్యాల గూర్చి ఆయన అడిగి తెలుసుకున్నారు. మత్స్య శాఖ లక్ష్యాలను డిడి సత్యనారాయణను అడుగగా మత్స్యకారులకు అవసరమైన రుణాలు వాహనాలు, తదితరమైనవి బ్యాంకర్లు మంజూరు చేస్తున్నట్లు డిడి కలెక్టర్ కు వివరించారు. చేపలు పెంచేందుకు రుణాలు అవసరం ఉంటుందా లేదని కలెక్టర్ అడుగగా చెరువులు లీజుకి ఇచ్చేటప్పుడు గ్రూపులకు ఇస్తామని డిడి చెప్పారు. ఆయా గ్రూపులకు రుణాలు అవసరమైతే సంబంధిత బ్యాంకుల ద్వారా రుణాలు పొందుతున్నట్లు డిడి తెలిపారు. సూర్యఘర్ ఎక్కువ మందికి విక్రయించేలా చర్యలు తీసుకోవాలని ఈపిడీసియల్ అధికారులను ఆదేశించారు. డిగ్రీ కళాశాల వద్ద శిక్షణ ఇస్తున్నట్లు ఈపిడీసియల్ అధికారి నుండి కలెక్టర్ కు వివరించారు. నైపుణ్యాభివృద్ధి శాఖ తో సంబంధం ఉన్న ప్రతీ శాఖ సమన్వయంతో ఆయా శాఖలకు సంబంధించిన శిక్షణ తీసుకోవాలన్నారు. జిల్లా అధికారులు ఒకసారి నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థను సందర్శించాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలను తప్పకుండా బ్యాంకర్లంతా అమలు చేయాలని లీడ్ బ్యాచ్ మేనేజర్ పి. శ్రీనివాసరావు బ్యాంకర్లకు సూచించారు. కిసాన్ క్రెడిట్ కార్డు, మత్స్యకారులకు, పశు సంవర్ధక శాఖలకు సంబంధించి రుణాలు అందిస్తామని నాబార్డు డిడి ఎం రమేష్ కృష్ణ వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం కుటుంబానికి ఒక పారిశ్రామిక వేత్తలుగా ఉండే విధంగా బ్యాంకర్లు సహకరించాలని ఆదేశించారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా బ్యాంకర్లు పనిచేయాలన్నారు. ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన కింద పంట రుణాలు తీసుకున్న ప్రతీ రైతు ప్రీమియం చెల్లించి నమోదు కావాలన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు భీమా ఉపయోగపడు తుందని నాబార్డు డిడిఎం రమేష్ కృష్ణ వివరించారు. ఈ సమావేశంలో యుబిఐ ప్రాంతీయ అధిపతి పి. రాజ, లీడ్ బ్యాంక్ మేనేజర్ పి. శ్రీనివాసరావు, డిసిసిబి జనరల్ మేనేజర్ వర ప్రసాద్, ఉద్యానవన శాఖ ఎడి ప్రసాదరావు, నాబార్డ్ మేనేజర్ రమేష్ కృష్ణ, మత్స్య శాఖ జిల్లా అధికారి సత్యనారాయణ, ఎపిఎంఐపి డిడి శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి త్రినాధ స్వామి, ఆయా బ్యాంకల నుంచి ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

### 28న మెగా జాబ్ మేళా

పాతపట్నం మహేంద్ర డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 28వ తేదీ (సోమవారం) ఉదయం 9 గంటలకు మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఉద్యోగావకాశాలను పొందేందుకు నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ మేళాలో ప్రీమియర్ ఇంజనీర్స్, డెక్కన్ ఫైన్ కెమికల్స్, అపిటోరియా, ఎన్.ఎస్. ఇన్స్ట్రుమెంట్స్, ముత్తూట్ గ్రూప్, అపోలో ఫార్మసీస్ లిమిటెడ్‌తో కలిపి మొత్తం 13 కంపెనీలు పాల్గొననున్నాయి. 562 ఖాళీలకు నియామకాలు జరగనున్నట్లు కలెక్టర్ వివరించారు. ఎస్.ఎస్.సి., ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీ.ఫార్మసీ చదివిన 18-30 ఏళ్ల యువత ఈ మేళాకు అర్హులు. అభ్యర్థులు naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో ముందుగానే రిజిస్ట్రేషన్ చేసుకుని, రిఫరెన్స్ నంబర్, రెజ్యూమే, ఆధార్, విద్యార్హతల అసలు సర్టిఫికెట్లు, జెరాక్స్ కాపీలు, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు తీసుకువచ్చి ఉదయం 9 గంటలకు హాజరు కావాల్సి ఉంటుంది. వివరాలకు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ ను 83176 52552, 83320 39243 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

## ముఖ్యమంత్రిని కలసిన ఎమ్మెల్యే ఎంజీఆర్

**-ఉద్దానం ఫేజ్-2 పనులు త్వరితగతిన ప్రారంభించాలని విజ్ఞప్తి**



**పాతపట్నం, జులై 23(వార్త):** పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు (ఎంజీఆర్) బుధవారం సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలసి పాతపట్నం నియోజకవర్గ అభివృద్ధి అంశాలపై పలు వినతులు సమర్పించారు. ఉద్దానం ఫేజ్-2 జల జీవన్ మిషన్ కింద రూ.265 కోట్ల నిధులతో ఇంటింటికి తాగునీటి పైపులైన్ పనులను తక్షణమే ప్రారంభించి త్వరగా పూర్తి చేయాలని సీఎం వద్ద విజ్ఞప్తి చేశారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఏర్పాటు చేయాలని, వంశధార గొట్ట బ్యారేజ్ మరమ్మత్తులు, కుడి-ఎడమ ప్రధాన కాలువల మరమ్మత్తులకు నిధులు కేటాయించాలని కోరారు. ఈ సందర్భంగా సీఎం సానుకూలంగా స్పందించారని, నియోజకవర్గ అభి వృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.


## విద్యార్థుల ఆరోగ్యంపై అప్రమత్తం



**మెళియాపుట్టి, జులై 23(వార్త):** ఐటీడీఏ పరిధిలో గల ఆశ్రమ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యం పట్ల ఉపాధ్యాయులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని ఐటీడీఏ ఏపీవో జి.చిన్నబాబు అన్నారు. బుధవారం నాడు ఆయన మెళియాపుట్టి మండలంలో గల పి.ఎల్ పురం బాలుర ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, జ్వరం లక్షణాలు కనిపించిన వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించాలన్నారు. మలేరియా, టైఫాయిడ్ లక్షణాలు కనిపిస్తే వెంటనే స్థానిక పిహెచ్ సీకు తీసుకువెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా వసతి గృహంలోనున్న స్టోర్ గదిని పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు రికార్డులనుసైతం పరిశీలించారు. వసతి గృహ గదులను పరిశీలించి శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజన పథకం పరిశీలించి విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు

**శ్రీకాకుళం, జులై 23(వార్త):** సీజనల్ వ్యాధులు సోకే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు పాటించి అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.అనిత అన్నారు. బుధవారం స్థానిక జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి కార్యాలయంలో విలేకరులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతావరణ పరిస్థితుల దృష్ట్యా సీజనల్ వ్యాధులు, ఇన్ఫెక్షన్లు సోకే ప్రమాదం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండి ముందస్తు జాగ్రత్తలను తప్పకుండా తీసుకోవాలన్నారు. నీరు, కలుషిత ఆహారం ద్వారా అధికంగా వ్యాధులు ప్రబలతాయని తెలిపారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా నిర్మూలనకు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా గ్రామీణ నీటి సరఫరా శాఖ, మున్సిపల్, పంచాయతీ శాఖ అధికారులను కార్యాచరణ ప్రకారం చర్యలు చేపట్టాలని స్పష్టంగా ఆదేశించినట్లు వివరించారు. తాగునీటి ట్యాంకులు, నీరు నిల్వ ఉన్న ప్రదేశాలలో తాగునీటి పరీక్షలు చేపట్టాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారులను కలెక్టర్ ఆదేశించినట్లు తెలిపారు. జనవరి మాసం నుండి మలేరియా, డెంగ్యూ , చికెన్ గున్యా వంటి కేసులలో కొద్దిపాటి లక్షణాలతో డెంగ్యూ కేసులు నమోదైనప్పటికీ తొందరగా రోగులకు కోలుకున్నట్లు తెలిపారు. పక్క రాష్ట్రమైన ఒడిస్సా నుండి వచ్చిన రోగులతో కంచిలి ప్రాంతాల్లో మలేరియా కేసులు వ్యాప్తిచేంది 24 కేసులు నమోదు అయినట్లు వివరించారు. ఫ్రైడే ఫ్రైడే నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా మున్సిపాలిటీ, పంచాయితీ ఆధ్వర్యంలో నీటి నిల్వలు, కొబ్బరి బొండాలు, ఖాళీ సీసాలో చేరిన నీరు వంటి ప్రాంతాల్లో లార్వా వృద్ధి చెందకుండా దోమల నివారణకు పారిశుధ్య, పిచికారి పనులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దోమల నిర్మూలనకు ఇండోర్ రీసెడ్యూయల్ స్ప్రేయింగ్, స్పేస్ స్ప్రేయింగ్, రీసెడ్యూయల్ స్ప్రే వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం పైలట్ ప్రోగ్రామ్ గా గిరిజన ప్రాంతాల్లో దట్టమైన పొదలు, వెళ్లేందుకు అవకాశం లేని ప్రాంతాల్లో దోమల నివారణకు డ్రోన్ సహాయంతో పిచికారీ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. వర్షాకాలంలో ఎక్కువగా అతిసార వ్యాధి, టైఫాయిడ్, పచ్చకామెర్లు వంటి వ్యాధులు సంక్రమిస్తాయని ప్రజలు ఈ వ్యాధుల పట్ల అవగాహన కలిగి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, తరచూ చేతులు శుభ్రం చేసుకోవడం అలవాటు చేసుకోవాలని, నిల్వ ఉంచిన వంట పాత్ర ఆహార పదార్థాలపై మూతలు పెట్టడం వంటి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి రామదాసు, స్టాటిస్టికల్ అధికారి రామ నాగేశ్వరరావు, పరిపాలనాధికారి బాబూరావు, డిప్యూటీ డెమో అధికారి ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



# సుపరిపాలనతోనే రాష్ట్రాభివృద్ధి



**మందస, జులై 23(వార్త):** సుపరిపాలనతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మూలిపాడు గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల పక్షానే ఉంటుందన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను అందజేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాలకు సమ ప్రాధాన్యత కల్పిస్తూ ఇచ్చిన మాట ప్రకారం హామీలను నెరవేరుస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మందస మండల అధ్యక్షుడు భావన దుర్యోధన, పీరికట్ల విఠల్ రావు, పార్టీ నాయకులు దాసరి తాతారావు, రట్టి లింగరాజు, ముడిమించి నవీన్‌కుమార్, కొండపల్లి నారాయణ రావు, మంగళపాత్రో, పలువురు టీడీపీ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

**పలాస, జులై 23(వార్త):** కూటమి ప్రభుత్వం ఏడాది పాలన సందర్భంగా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం పలాస మండలం కేదారిపురం గ్రామంలో బుధవారం పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష మాలు వివరించి, ఏడాదిలో ఏం చేశారో, భవిష్యత్తులో ఏం చేస్తారో అనే అంశాలను ప్రజలకు వివరించారు. ప్రజాప్రతినిధులు కరపత్రాలు పంచుతూ ఇంటింటికి తిరిగారు, సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కూటమి పాలనపట్ల ప్రజల నుంచి అద్భుతమైన స్పందన వస్తోందని ఎమ్మెల్యే గౌతు శిరీష చెప్పారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదేళ్ల పాలనలో జగన్ దోచుకోవడం దాచుకోవడం తప్ప చేసిందేమీ లేదన్నారు. ప్రతి ఇంటింటికి వెళ్లి ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రజలతో మాట్లాడారు. కార్యక్రమంలో పలాస నియోజకవర్గ పరిశీలకులు చౌదరి బాబ్జీ, పి.విఠల్‌రావు, మల్లా శ్రీను, పాడి దుర్యోధన, నారాయణ, కుమార్ స్వామి, సిసింద్రీ, పొలాకి దనంజేయ, కేశవరావు, వాసు, లక్ష్మణరావు, తులసీదాసు, కృష్ణారావు, చలపతి పాల్గొన్నారు.

**కొత్తూరు, జులై 23(వార్త):** మండలంలోని కొత్తూరు మేజర్ గ్రామపంచాయతీలో "సుపరిపాలనలో తొలి అడుగు - ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ శాసనసభ్యులు మామిడి గోవిందరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి తిరుగుతూ కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు వివరించారు. కరపత్రాల ద్వారా సమాచారాన్ని పంచుతూ గ్రామస్థులతో నేరుగా ముఖాముఖి చర్చలు



స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "గత వైసీపీ ప్రభుత్వంలో ప్రజల హక్కులు కాలరాయబడ్డాయి. జగన్ మోహన్ రెడ్డి నియంత్రత్వంలో రాష్ట్ర అభివృద్ధి కుంటుపడింది. ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మళ్లీ స్థిరపడుతోంది. పేదలకు సంక్షేమ పథకాలు అందించడంలో ప్రభుత్వం శ్రద్ధ తీసుకుంటోంది" అని తెలిపారు. దీపం పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్‌లతో మహిళల వంటింటి కష్టాలు తగ్గాయని అన్నారు. అలాగే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పెంపుతో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఆర్థిక భరోసా అందుతోందని పేర్కొన్నారు. అలాగే, "ఎన్నికల సమయంలో ప్రజల వద్దకు వెళ్లినప్పుడు వచ్చిన ఆదరణ మళ్లీ ఇప్పుడు సంవత్సరానికైనా ఇంకా ఎక్కువగా లభిస్తోంది. మేమిచ్చిన హామీలను నెరవేర్చినందుకు ప్రజలు మమ్మల్ని విశ్వసిస్తున్నారు" అని ఎమ్మెల్యే చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షుడు అగతముడి మాధవరావు, సీనియర్ నాయకుడు అగతముడి భైరగినాయుడు, వైస్ ఎంపీపీ లోతుగడ్డ తులసి వర ప్రసాద్ నాయుడు, అగతముడి అరుణ్ బాబు, కార్లేమ్మ సర్పంచ్ లోతుగడ్డ భగవాన్ నాయుడు, ఆరుబోలు దశరథ, సిహెచ్ రాము, తొంపల తిరుపతి, బోర శ్రీరాములు, ముగితి కృష్ణ, పాలవలస గోవింద ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, మండల క్లస్టర్ యూనిట్ బూత్ ఇంచార్జులు, పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ కార్యక్ర... జరిపారు. ప్రజల నుంచి సమస్యలపై అర్జీలను

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546